నేడే భోగ భాగ్యాల బోగి

రేపే సం'క్రాంతి'.. ఎల్లుండి ముక్కనుమ

ఇంటింటా పిండి వంటల ఘుమఘుమలు

పతంగులు ఎగురవేస్తూ చిన్నారుల సందడి

ఇండ్ల ముందు ముగ్గులు వేస్తూ ఆడబిడ్డలు

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 13 (నమస్తే తెలంగాణ)/ ఖమ్మం/ కొత్తగూడెం టౌన్: మురిపాల సంక్రాంతి పల్లె ముంగిట్లోకి వచ్చింది. ఎక్కడ చూసినా సంక్రాంతి శోభ కనిపిస్తున్నది. విద్యా, ఉద్యోగం, ఉపాధి అవకాశాల కోసం ఎల్లలు దాటిన వారంతా పుట్టి పెరిగిన ఊరిలో పండుగ జరుపుకోవడానికి చేరుకుంటున్నారు. విద్యాలయాలకు సెలవులు ఇవ్వడంతో పిల్లలందరూ ఇండ్లకు చేరుకుంటున్నారు. చిన్నారులు గాలిపటాలు ఎగురవేస్తూ సందడి చేస్తున్నారు. ఆడపిల్లలు ముగ్గులు వేస్తూ కనిపిస్తున్నారు. ఇంటింటా పిండి వంటలు ఘుమఘుమలాడుతున్నాయి. ఉమ్మడి జిల్లా ప్రజలు ఆదివారం భోగి, సోమవారం సంక్రాంతి, మంగళవారం కనుమ పండుగలు జరుపుకోనున్నారు. సంక్రాంతి సీజన్ కావడంతో ఊరూరా డూ డూ బసవన్న అంటూ గంగిరెద్దులు విన్యాసాలు చేస్తున్నాయి. హరిదాసులు 'రామ.. రామ.. సీతా..' అంటూ కీర్తనలు ఆలపిస్తున్నారు.

పల్లె పల్లెనా పండుగ శోభ

ముచ్చటగా మూడు రోజుల పండుగ..

తెలుగు వారి పెద్ద పండుగ సంక్రాంతి. ఈ పండుగ రోజుల్లో అందరి గృహాలూ కొత్త అల్లుళ్లు, బంధుమిత్రులతో కళకళలాడుతుంటాయి. సంక్రాంతి అంటే సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించే సమయం. మకర సంక్రమణం జరుగుతుంది కాబట్టే మకర సంక్రాంతి అని పిలుస్తారు. సంక్రాంతికి ముందు రోజు వచ్చే పండుగ.. భోగి. తరువాత వచ్చే పండుగ కనుమ. సంప్రదాయాలకు ప్రతిబింబంగా ఉన్న ఈ పండుగ రోజున అందరూ కలుసుకునేందుకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఎక్కడున్నా ఇళ్లకు చేరుకుంటారు. ఇంటిల్లిపాదీ సంతోషంగా గడుపుతారు. ఇక ఈ పండుగకు పదిరోజుల ముందే పిండి వంటల తయారీ హడావిడి ప్రారంభమవుతుంది. అరిసెలు, పాకుండలు, సకినాలు, మిఠాయిలు ఈ పండుగకు ప్రత్యేకమైన వంటకాలు. ఈ పండుగ సమయంలోనే పంట మొత్తం రైతుల చేతికి వస్తుంది. దీంతో ఖర్చు కాస్త ఎక్కువైనా పండుగకు వెచ్చించేందుకు వెనుకాడరు. ఇక భోగి పండుగను భోగ భాగ్యాల భోగిగా పిలుచుకుంటారు. ఈ రోజున ఇంట్లో వారంతా వేకువజామునే లేచి ఇంట్లో ఉన్న పుల్లలు, పాత సామగ్రి, ఆవుపేడతో చేసిన పిడకలు మొదలైన వాటితో భోగి మంటలు వేస్తారు. మరో ప్రత్యేకం.. బొమ్మల కొలువు. మన పూర్వీకుల సంప్రదాయం, వారు వినియోగించిన వస్తువులను ఇప్పటి పిల్లలు మర్చిపోకుండా ఉండాలనే ఉద్దేశంతో పలు రకాల బొమ్మలతో ఈ బొమ్మల కొలువును ఏర్పాటు చేస్తారు. ఇక చంటి పిల్లలు ఉన్న వారు చిన్నారుల తలలపై రేగు పండ్లు పోసి.. వాటిని అందరికీ పంచుతారు. రేగు పండ్లు, గరక పోచలతో తలంటు స్నానాలు కూడా చేయిస్తారు. తరువాత సంక్రాంతి రోజు చుట్టు పక్కల వారికి, చేతి వృత్తుల వారికి పండి వంటలను పంచిపెడతారు. అనంతరం కనుమ పండుగ. ఈ రోజున పశువులకు పూజ చేస్తారు. కనుమకు తినేవారు మాంసాహారం, మినప గారెలు వండుకుంటారు. ఆ తర్వాతి రోజును ముక్కనుమ అని కూడా పిలుస్తారు. దీంతో ఈ పండుగల జరిగే మూడు నాలుగు రోజులూ ప్రతి ఇల్లూ ఎంతో సందడిగా ఉంటుంది.

అశ్వారావుపేట టౌన్ : హరిదాసుకి భిక్ష వేస్తున్న మహిళ

దుమ్ముగూడెం : గ్రామాల్లో గంగిరెద్దుల సందడి

కారేపల్లి : పిండివంటలు చేస్తున్న మహిళ

ఖమ్మం బస్టాండ్‌లో బస్సులో సీటుకోసం ప్రయాణికుల తిప్పలు..

ప్రయాణికులతో కిక్కిరిసిన ఖమ్మం రైల్వే స్టేషన్

కిక్కిరిసిన బస్సులు, ప్రైవేటు వాహనాలు..

సంక్రాతి పండుగ సందర్భంగా టీఎస్ ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నది. ఒకవైపు ఆర్టీసీ బస్సులు, మరోవైపు ప్రైవేటు వాహనాలు నడుస్తున్నా రద్దీ మాత్రం తగ్గడం లేదు. రైళ్లలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తున్నది. ఖమ్మం, కొత్తగూడెం రైల్వేస్టేషన్లతో పాటు రెండు జిల్లాల్లోని ప్రధాన బస్టాండుల్లో ప్రయాణికులు కిటకిటలాడుతున్నారు. మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే అవకాశం ఉండడంతో బస్సులు హౌస్‌ఫుల్. రెండు జిల్లాల నుంచి ఇతర ప్రాంతాల్లో సెటిల్ అయిన వారిలో ఎక్కువ మంది హైదరాబాద్‌లో ఉండే వారే ఎక్కువ. అక్కడి నుంచి వందలాదిగా సొంత ఊళ్లకు తరలివస్తున్నారు. రైళ్లు, బస్సుల్లో ముందుగానే రిజర్వేషన్ చేయించుకుని ప్రయాణిస్తున్నారు.

ఖమ్మం బస్టాండ్‌లో బస్సు కోసం వేచియున్న ప్రయాణికులు

కొత్తగూడెం బస్టాండ్‌లో బస్సుల కోసం వేచిఉన్న ప్రయాణికులు

ఖమ్మం రైల్వే స్టేషన్‌లో రైలు ఎక్కేందుకు ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

కీళ్ల వ్యాధి బాధితుడికి రూ.లక్ష ఎల్వోసీ

చెక్కు అందజేస్తున్న రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర

ఖమ్మం, జనవరి 13: ఖమ్మం నగర శివారులోని ధంసలాపురం కొత్త కాలనీకి చెందిన రవీంద్రబాబు కొన్ని నెలల నుంచి ఆర్థరైటిస్ అనే కీళ్ల వ్యాధితో బాధపడుతున్నాడు. వ్యాధి కారణంగా ప్రస్తుతం తొంటి ఎముకలు దెబ్బతిని సక్రమంగా నడవలేని, కూర్చోలేని స్థితికి వచ్చాడు. రవీంద్రబాబుకు వైద్యపరీక్షలు చేసిన హైదరాబాద్ నిమ్స్ వైద్యులు ఆపరేషన్ అవసరమని నిర్ధారించారు. దీంతో బాధితుడు ఆర్థిక సాయం కోసం ఇటీవల రాజ్యసభ్యుడు వద్దిరాజు రవిచంద్రను ఆశ్రయించాడు. ఆయన వెంటనే స్పందించి రూ.లక్ష ఎల్వోసీకి రాష్ట్రప్రభుత్వానికి లేఖ రాశారు. అది అప్రూవల్ కావడంతో రాజ్యసభ సభ్యుడు శనివారం ఖమ్మంలో బాధితుడికి రూ.లక్ష ఎల్వోసీ అందించారు.

మత్స్య శిక్షణ పూర్తి

సర్టిఫికెట్లు అందజేస్తున్న యూనియన్ బ్యాంక్ మేనేజర్ ప్రసాద్, మత్స్య శాస్త్రవేత్తలు

కూసుమంచి, జనవరి 13: మండలంలోని పాలేరులోగల పీవీ నర్సింహారావు మత్స్య పరిశోధనాకేంద్రంలో తొమ్మిది జిల్లాలకు చెందిన 25 మంది రైతులకు మూడు రోజుల మత్స్య శిక్షణ శనివారం పూర్తయింది. వారికి సర్టిఫికెట్లను యూనియన్ బ్యాంక్ మేనేజర్ ప్రసాద్ అందించారు. సైంటిస్టులు శ్యాం ప్రసాద్, శాంతన్న, అనూష, జగన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికే 'ప్రజాభవన్'

ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

ప్రజాభవన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయం

మణుగూరు టౌన్, జనవరి 13: మణుగూరులో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ప్రజాభవన్‌ను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శనివారం ప్రారంభించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. పజలు తమ సమస్యలను నేరుగా ప్రజాభవన్‌కు వచ్చి తనకు చెబితే వెంటనేపరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. తనను గెలిపించిన ప్రజలకు, సహకరించిన అక్షిలపక్ష నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. బీటీపీఎస్, సింగరేణి, ఇతర కర్మాగారాల్లో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తానన్నారు.

పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో 'సర్వేపల్లి' విగ్రహావిష్కరణ

సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

టేకులపల్లి, జనవరి 13: పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ గురువుల చేతుల మీదుగా మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహాన్ని ఆవిష్కరించారు. టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2001-02 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు, గురువుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆ పాఠశాలలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం!

వారంతా మూడు దశాబ్దాల క్రితం ఒకే కళాశాలలో చదువుకున్నారు. ఆ తర్వాత ఎవరి దారుల్లో వారు వెళ్లిపోయారు. కొందరు ఉన్నత విద్య చదివి అధికారులయ్యారు. మరికొందరు ప్రైవేటు రంగంలో ఉద్యోగులుగా రాణిస్తున్నారు. ఇంకొందరు స్వయంగా వ్యాపారం మొదలుపెట్టి వ్యాపారులుగా స్థిరపడ్డారు. ఇలా ఒక్కొక్కరూ ఒక్కో రంగంలో తమదైన పాత్ర పోషిస్తున్నారు. వీరందరినీ ఒకే వేదికపైకి తీసుకొచ్చింది 'పూర్వ విద్యార్థుల సమ్మేళనం.' అందుకు సత్తుపల్లి ప్రభుత్వ బండి శోభనాచలం జూనియర్ కళాశాల వేదికైంది. తెలిసిన వివరాల ప్రకారం.. కళాశాలకు చెందిన 1987-89 బ్యాచ్ విద్యార్థులు మరోసారి పాత జ్ఞాపకాలను నెమరువేసుకోవాలని అనుకున్నారు. నాటి మధుర క్షణాలను మళ్లీ తీసుకురావాలనుకున్నారు. ఒకరిద్దరు చొరవ తీసుకుని అందరినీ ఒక్కతాటిపైకి తీసుకొచ్చారు. శనివారం కళాశాలలో అనుకున్నట్లే పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఒకరికొకరు యోగక్షేమాలను తెలుసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కళాశాలలో హ్యాపీగా గడిపారు.

– సత్తుపల్లి, జనవరి 13

గంజాయి విక్రేత, చోరీ నిందితుల అరెస్ట్

రూ.2.65 లక్షల సొత్తు, గంజాయి స్వాధీనం

టౌన్, టాస్క్‌ఫోర్స్ ఏసీపీలు హరికృష్ణ, శివరామయ్య

రఘునాథపాలెం, జనవరి 13 : జల్సాలకు అలవాటుపడి పలురకాల చోరీలు, గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను ఖానాపురంహవేలీ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఖమ్మంటౌన్ ఏసీపీ హరికృష్ణ టాస్క్‌ఫోర్స్ ఏసీపీ శివరామయ్యతో కలిసి ఖానాపురం హవేలీపోలీస్ స్టేషన్‌లో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఖమ్మం నగరానికి చెందిన సయ్యద్ మౌలానా అలియాస్ అఫ్రోజ్, షేక్ ఖాసీం మరో బాలుడితో కలిసి శనివారం మోటార్‌సైకిల్‌పై వస్తుండగా శ్రీశ్రీ సర్కిల్ వద్ద తనిఖీలు చేపడుతున్న పోలీసులు అనుమానంతో వాహనాన్ని నిలిపివేశారు. ఆ సమయంలో షేక్ ఖాసీం పోలీసులను చూసి పరారయ్యాడు. వెంటనే పోలీసులు మిగిలిన ఇద్దరినీ అదుపులోకి తీసుకొని తనిఖీలు చేపట్టగా వాహనానికి ఉన్న సంచిలో రెండు కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనపర్చుకున్నారు. ఇరువురిని విచరించగా గతంలో పలు చోరీలకు పాల్పడిన విషయాన్ని తెలిపినట్లు పేర్కొన్నారు. మహబూబాబాద్‌లో మోటార్‌సైకిల్ చోరీ, ఖమ్మం వన్‌టౌన్ పరిధిలో స్కూటీ, ఖానాపురం హవేలీస్టేషన్ పరిధిలో ఓ వృద్ధురాలి మెడలో బంగారుగొలుసు అపహరణ చేసినట్లు ఒప్పుకున్నట్లు పేర్కొన్నారు. ఈ చోరీ సొత్తును స్వాధీనపర్చుకున్నట్లు తెలిపారు. వీటివిలువ రూ.2.65 లక్షలు ఉంటుందన్నారు. సమావేశంలో ఖానాపురం హవేలీ సీఐ శ్రీహరి, టాస్క్‌ఫోర్స్ సీఐ తిరుపతి, ఎస్సైలు ఎన్.వీరేందర్, రాము, సిబ్బంది పాల్గొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీలు హరికృష్ణ, శివరామయ్య

రామయ్యకు స్వర్ణ తులసి పూజలు

భద్రాచలం, జనవరి 13: భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయ అంతరాలయంలోని మూలవరులకు శనివారం అర్చకులు స్వర్ణ తులసి పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి సుప్రభాత సేవ, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్య పూజలు చేపట్టారు. అనంతరం నిత్యకల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకొని వచ్చి శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం నిర్వహించారు. కల్యాణ దాతలుకు తీర్థప్రసాదాలను, శేష వస్త్రాలు అందజేశారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

భద్రాద్రి రామాలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన కార్యక్రమానికి శనివారం హైదరాబాద్ వాస్తవ్యులు శ్రీరంగం కార్తీక్, శ్రీరామ్, లక్ష్మి లావణ్య రూ. 1,00,116 విరాళం అందజేశారు. అధికారుల నుంచి రశీదు స్వీకరించారు. దాతలను అర్చకులు సత్కరించి స్వామి వారి ప్రసాదాలు అందజేశారు. అలాగే హైదరాబాద్‌కు చెందిన మరో భక్తురాలు తాడికొండ గౌరీహరిణి ఆమె కుటుంబ సభ్యులతో కలిసి నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం అందించారు.

ఆలయ సన్నిధిలో ఎమ్మెల్యే పాయం

రామయ్య సేవలో ఎమ్మెల్యే పాయం

భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయంలో స్వామివారిని శనివారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఎమ్మెల్యేకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ముందుగా ధ్వజస్తంభం వద్ద నమస్కరించుకొని అంతరాలయంలోని మూలవరులను పూజించారు. ఏఈఓ భవానీరామకృష్ణ, అర్చకులు ఆయనకు స్వామివారి తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేశారు.

నేడు గోదా కల్యాణం

పర్ణశాల, జనవరి 13: భద్రాద్రి రామాలయానికి అనుబంధ ఆలయమైన పర్ణశాల ఆలయంలో ఆదివారం శ్రీరంగనాథ గోదా కల్యాణం జరిపిస్తున్నట్లు ఆలయ అర్చకుడు శేషకిరణ్ కుమారాచార్యులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అనంతరం ధనుర్మాస మహోత్సవంలో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు.

కిన్నెరసానిని సందర్శించిన ఐటీడీఏ పీవో

కిన్నెరసానిలో విహరిస్తున్న పీవో దంపతులు

పాల్వంచ రూరల్, జనవరి 13: భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ శనివారం కుటుంబ సభ్యులతో కలిసి కిన్నెరసాని ప్రాజెక్ట్‌ను సందర్శించారు. డీర్ పార్కు, పక్షుల మ్యూజియాన్ని వీక్షించారు. డ్యామ్‌పై విహరించారు. అనంతరం రిజర్వాయర్‌లో స్పీడ్ బోట్ షికారు చేశారు.